రుచిలో మేటి ‘జగనన్న గోరుముద్ద’

నియోజకవర్గంలో 33,067 మంది విద్యార్థులకు ప్రయోజనం





మధ్యాహ్న భోజనంలో బిర్యానీ, కోడిగుడ్డు, బంగాళదుంప కుర్మా, పప్పు, పప్పు చెక్కీలు, మెనూ

తగరపువలస: గత ప్రభుత్వాల హయాంలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అధ్వానంగా వుండేది. రాళ్లు, పురుగులు, మట్టిబెడ్డలతో కూడిన అన్నం, పప్పు జాడే లేని నీళ్లలాంటి చారు విద్యార్థులకు వడ్డించేవారు. ఆకలితో నకనకలాడే విద్యార్థులు సైతం అలాంటి అన్నం, చారు సహించక బయట పడేసేవారు. కొందరైతే అర్ధాకలితో, మరికొందరు సమీపంలోని ఇళ్లకు వెళ్లి భోజనం చేసేవారు. అప్పటి ప్రభుత్వ హాయంలో కాంట్రాక్టర్ల ద్వారా చాలాసార్లు స్కూల్‌కు భోజనం మధ్యాహ్నం 2 తర్వాత కూడా వచ్చేది. చాలా సందర్భాల్లో కోడి గుడ్డు కూడా వడ్డించేవారు కాదు.



భోజనాల కోసం క్యూలో విద్యార్థినులు

ఇష్టంగా తింటున్న జగనన్న గోరుముద్ద

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మధ్యాహ్న భోజన పథకం స్వరూపమే మార్చివేశారు. ఈ అయిదేళ్లలో వారంలో రోజూ వెరైటీలు వడ్డిస్తున్నారు. మెనూలో నాణ్యతతో కూడిన అన్నం, వెజ్ పలావ్, హాట్ పొంగల్, పులిహోర, వెజిటబుల్ రైస్, సాంబార్ బాత్, లెమన్ రైస్, ఆకుకూర రైస్, గ్రేవీ కర్రీ, దొండకాయ చట్నీ, ఆలూ కుర్మా, టమాటా చట్నీ, ఆకుకూర పప్పు, పప్పుచారు చేర్చారు. స్నాక్స్ కింద బెల్లంతో కూడిన వేరుశనగ పప్పు చెక్కి, అయిదు రోజులపాటు కోడి గుడ్లు ఇస్తున్నారు. పౌష్టికాహారంగా రాగి జావను జోడించారు. ఈ ప్రయోజనాన్ని నియోజకవర్గంలోని 33,067 మంది విద్యార్థులు పొందుతున్నారు.



చిట్టివలస బాలికల హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తీసుకుంటున్న విద్యార్థినులు

అక్షయ ‘పాత్ర’కు వంట బాధ్యతలు

భీమిలి, ఆనందపురం మండలాలు, చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి వడ్డించే బాధ్యతను అక్షయపాత్ర ఫౌండేషన్ తీసుకుంది. మిగిలిన చోట్ల ఏజెన్సీల ద్వారా ఆహారం తయారవుతుంది. ఫౌండేషన్‌కు ఆనందపురం మండలం గంభీరం గ్రామం వద్ద రూ.7.35 కోట్లతో ఆధునిక వంటపాత్రలు, సుకాడీలు, ఆర్వో ప్లాంట్, కోల్డ్ స్టోరేజ్, గ్యాస్ సిలిండర్లు, బాయిలర్, స్టోర్ రూమ్, కూరగాయాలు తరిగే యంత్రాలు, వెట్ గ్రైండర్లు, కొబ్బరి తరుము యంత్రాలు తదితర అన్ని వసతులతో కూడిన వంటశాలను నిర్మించారు. మొదట్లో 20 వేల మంది విద్యార్థులకు వండి పెట్టేవారు. అనంతరం ఆ సామర్థ్యాన్ని మరో 15 వేల మందికి పెంచారు. ప్రస్తుతం 17వేల మందికి భోజనం తయారు చేస్తున్నారు.

ఇంట్లో కంటే వెరైటీలు ఎక్కువ



మన ఇళ్లల్లో కూడా ఇన్ని వెరైటీ వంటలు ఉండవు. వారంలో రోజూ మెనూ మార్చి వండి ఆరోగ్యకరమైన భోజనం వడ్డిస్తున్నారు. రుచికరమైన భోజనం మనసారా తింటున్నాం. థాంక్యూ జగన్ మామయ్య.

– మజ్జి జ్యోత్స్న, తగరపువలస

వేడి వేడిగా అందిస్తున్నారు



సీజన్ ఏదైనా రోజూ మాకు వేడి వేడి ఆహార పదార్థాలు అందిస్తున్నారు. చదువు బాగా సాగాలంటే పౌష్టికాహారం అవసరం. అందుకే జగన్ మామ అదనంగా కోడిగుడ్డు, బెల్లం వేరుశనగ చక్కీ, రాగి అంబలి అందిస్తున్నారు.

– చందక లీలావతి, చిట్టివలస

రుచిలో కూడా మేటి..



ప్రభుత్వ పాఠశాలలో రుచికరమైన భోజనం అందిస్తుండటం వల్ల ఉపాధ్యాయులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాళ్లు రుచి చూసి షడ్రషోపేతమైన భోజనాన్ని అందిస్తున్న ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు.

– పట్నాల తనూజ, బంగ్లామెట్ట

అమృతంలాంటి ఆహారం



ప్రభుత్వ పాఠశాలల్లో అమృతం లాంటి ఆహార పదార్థాలు అందిస్తుండడం వల్ల విద్యార్థులు ఎవరూ ఇంటి వద్ద ఉండిపోవడం లేదు. రోజూ స్కూల్‌కు వెళ్తున్నారు. ఇలాంటి నాణ్యమైన ఆహారం గతంలో ఎప్పుడూ పాఠశాలల్లో పెట్టలేదని మా బంధువులు అంటున్నారు.

– మైలపల్లి సుగుణ, అన్నవరం

క్లుప్తంగా

పొట్నూరు విద్యార్థులకు అవార్డులు



హిందీ పరీక్షలో అవార్డులు పొందిన పొట్నూరు పాఠశాల విద్యార్థులు

పద్మనాభం: కడప జిల్లా ప్రొద్దుటూరు దశమందం విద్యా సేవాసదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ ప్రతిభ పరీక్షల్లో పొట్నూరు ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన నలుగురికి సిల్వర్, నలుగురికి గోల్డ్ మెడల్స్ వచ్చాయి. పి.చైతన్య, ఎన్.నాయుడు, ఎస్.హేమంత్, కె.వరుణ్ కుమార్‌కు గోల్డ్ మెడల్స్, ప్రశంసాపత్రాలు, ఎస్.భరత్ కుమార్, ఆర్.తనుష్, బి.గిరీషం, కె.గ్రీష్మకు సిల్వర్ మెడల్స్, ప్రశంసాపత్రాలు లభించాయి. వీరిని పాఠశాలలో గురువారం హెచ్‌ఎం బి.అప్పలరాజు, హిందీ పండిట్ చిన్నారి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ నగరంపాలెం 11 కేవీ ఫీడర్‌పై నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్వీఎస్ రామమూర్తి చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు గణేష్‌నగర్, పోర్టుకాలనీ, కళానగర్, బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్, డాక్‌యార్డు కాలనీ, వాంబేకాలనీ, శ్రీనివాసనగర్, అయోధ్యనగర్, ఆర్‌టీసీ కాలనీ, మానం ఆంజనేయులు కాలనీ, మల్లయ్యపాలెం, నగరంపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వినియోగదారులు, ప్రజలు గమనించి సహకరించాలని రామమూర్తి కోరారు.

10న కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



కన్యకా పరమేశ్వరి అమ్మవారు

పద్మనాభం: కృష్ణాపురంలోని మహా గణపతి, మహాలక్ష్మి, సమేత శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 10న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా పంచామృత అభిషేకాలు, గణపతి పూజ, పుణ్యాహవచనం, తులసి పూజ నిర్వహించనున్నట్టు తెలిపారు. 108 మంది ముత్తైదవులు కుంకుమ పూజ నిర్వహిస్తారని తెలిపారు.

చట్టాలపై అవగాహన సదస్సు నేడు

తగరపువలస: చట్టాలపై అవగాహన సదస్సు చిట్టివలస బంతాట మైదానంలో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. భీమిలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని న్యాయ సలహాలు, సూచనలు పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు.

స్కూల్ మరమ్మతులకు రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న పాల రమణారెడ్డి

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి సోమన్నపాలెంలో గల ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతులకు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి గురువారం రూ. 50వేలు విరాళంగా పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ సహాయం చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సంధ్య ఐ క్లినిక్ మార్కెటింగ్ హెడ్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సమగ్ర కంటి పరీక్షలు, దృశ్య తీక్షణ పరీక్షలు, స్క్రీనింగ్ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షరీఫ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

భీమిలిలో వైద్య శిబిరం



విద్యార్థులకు మందులు అందిస్తున్న వైద్యురాలు మీనాక్షి

భీమునిపట్నం: స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం యునాని వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని అవసరమైన మందులు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యునాని వైద్యంపై చాలా మందికి సరిగ్గా తెలియదని, ఇందులో అన్ని సమస్యలకు ఎన్నో మంచి మందులు ఉన్నాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సింహాచలం, ఉపాధ్యాయులు నయీం, సుజాత కుమారి, శ్రీనివాసరావు, వెంకటరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రి ఆలయ వార్షికోత్సవం



విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు



విగ్రహాల ఊరేగింపులో కలశయాత్ర

పద్మనాభం: మండలంలోని లింగన్నపేటలో మూడు రోజులు జరగనున్న వేదమాత గాయత్రి ఆలయ ఆశ్రమ 11వ వార్షికోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గాయత్రి, లలితా, దుర్గాదేవిల విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. విగ్రహాలను కలశ యాత్రతో గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా చిడతలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు అడ్డుకట్ట

తగరపువలస: సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా మన చుట్టూ జరిగే నేరాలకు అడ్డుకట్ట వేయడమే కాకుండా నిందితులను పట్టుకోవడానికి వీలవుతుందని భీమిలి సీఐ దివిలి రమేష్ తెలిపారు. తగరపువలస, చిట్టివలస పరిధిలో పలుచోట్ల సీసీ కెమెరాల ఏర్పాటుపై స్థానికులకు గురువారం అవగాహన కలిగించారు. ప్రజల రక్షణార్థం ప్రతి అపార్ట్‌మెంట్, వ్యాపార సంస్థల వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇటీవల జరిగిన హత్యలు, దొంగతనాల్లో సీసీ కెమెరాల సాయంతోనే నిందితులను పట్టుకున్నామన్నారు. సొంత గృహాలకు సీసీ కెమెరాలు పెట్టించుకోకపోయినా వీధిలో అందరూ కలిసి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చి భీమిలి పోలీసులతో సహకరించాలని కోరారు. నేరాల అదుపునకు నిందితులను పట్టుకోవడంలో ప్రజలు సహకరించాలని కోరారు. అనుమానితుల వివరాలు తమకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బాలాజీనగర్‌లో అవగాహన కలిగిస్తున్న సీఐ రమేష్

సైన్స్‌తో దేశానికి ఎంతో మేలు

మధురవాడ: సైన్స్ దేశానికి ఎంతో మేలు చేస్తోందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళీధర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సైన్స్ కళా బస్ యాత్ర గురువారం ఉదయం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు సైన్స్ ప్రాముఖ్యత, దానివల్ల కలిగే ప్రయోజనాలు వివరించేందుకు ఈ కళాజాత ప్రారంభించినట్టు చెప్పారు. ముఖ్యంగా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం కలిగించడానికి కృషి చేస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ ప్రయోగాలపై ఆసక్తి పెంచుకుని, సృజనాత్మకత పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కళాకారులు సైన్స్‌పై ప్రదర్శించిన నాటికలు, నృత్య రూపకాలు, గీతాలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు బోర అప్పలరెడ్డి, నాయకులు శేషగిరిరావు, శ్రీకాంత్, రమణబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ పరిశీలించారు. గత మూడు నెలలుగా 7, 8వ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడంతోపాటు సొంతంగా పాఠ్యాంశాలు చెప్పడంపై బోధించడం వల్ల వారి సామర్థ్యాలు ఏ మేరకు పెరిగాయో పరిశీలించామన్నారు. త్వరలో జరగనున్న పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

అధ్యాపకులు ఎస్.త్రినాథరావు, ఎం.మహాలక్ష్మి, పి.హరిణి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు అంతా కృషి చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. మధురవాడ వాంబే కాలనీ సునీల్ శర్మకాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎలిమెంటరీ స్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు నూతన పద్ధతులు ఉపయోగించి విద్యార్థులకు మరింత చక్కగా అర్థమయ్యే రీతిలో బోధించాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. 9వ తరగతి విద్యార్థులు ట్యాబ్స్ వినియోగం పెంచాలని, పాఠాలు వీక్షించాలన్నారు. అనంతరం 5వ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కూరమాన గీతాదేవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

అందరూ బాగుపడాలన్నదే సీఎం జగన్ ఆలోచన

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



రాజవీధిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

తగరపువలస: రాష్ట్రంలో ప్రజలంతా బాగుపడాలని కోరుకునే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, ఇలాంటి నేత దేశంలోనే లేరని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్, చిట్టివలస బొగ్గురోడ్డు, రాజవీధి తదితర ప్రాంతాల్లో రూ.1.70 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం శిలాఫలకాలు ఆవిష్కరించి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ, జనసేన, జన్మభూమి కమిటీల ద్వారా సంక్షేమం, అభివృద్ధి జరగదన్నారు. అందులో ఉన్నవారికి కూడా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే అన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చామన్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి... ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధికి మధ్య తేడా తెలుసుకుని ఓటు వేయాలన్నారు. ఇప్పటి వరకు వార్డులో రూ.132 కోట్లు సంక్షేమ పథకాల రూపేణా లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రూ.132 కూడా సంక్షేమం కోసం ఖర్చు చేసేవారు కాదన్నారు. భీమిలి జోన్‌లో 4 వేల మందికి ఇళ్ల పట్టాలు అందిస్తే ఒకటో వార్డులో 1600 మందికి ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ జి.శైలజవల్లి, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, జీవీ రమణ, కొప్పల రమేష్, జీరు సుజాత, తమ్మిన కూర్మారావు, చిల్ల గణేష్‌రెడ్డి, తమ్మిన నరసింగరావు, గూడెల నాని, బంక శ్రీను, జగుపల్లి సతీష్, పిల్లా త్రినాథ్, పల్లా పెంటరాజు, గిడుతూరి మురళి, పూర్ణ, కొప్పల కృష్ణ, వెంపాడ వెంకటరమణ, సిమ్మల ప్రసన్న, పందిరి విజయ్, నీలాపు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పనులు

భీమునిపట్నం: భీమిలిలో గతంలో ఎప్పుడూ జరగని విధంగా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం తగరపువలస రోడ్డులో ఉన్న జమ్మిచెరువు పార్కులో రూ.18 లక్షలతో ఏర్పాటు చేసిన లైటింగ్‌ను ప్రారంభించారు. అలాగే కొంకువీధిలో రూ.30 లక్షలు, గొల్లలపాలెం వద్ద రూ.40లక్షలతో నిర్మించిన రెండు రోడ్లను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. జోనల్ కమిషనర్ శైలజవల్లి, ఏఈ సుమన్, కార్పొరేటర్ గంటా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ రీజినల్ యువజన విభాగం అధ్యక్షుడు ముత్తంశెట్టి నందీష్‌బాబు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పార్కులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

పందుల స్వైర విహారం



పెందుర్తి వెళ్లే రోడ్డు పక్కన వ్యర్థాల వద్ద సంచరిస్తున్న పందులు

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాల్లో పందులు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇవి విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో ఆందోళనకు గురవుతన్నారు. నివాస ప్రాంతాల్లో పందుల పెంపకం నిషేధించినా పలు గ్రామాల్లో నేటికీ వాటిని పెంచుతున్నారు. వాటి వల్ల మెదడువాపు వ్యాధి వంటి రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయినా వాటి పెంపకంపై అధికారులు నిఘా ఉంచి చర్యలు తీసుకోవడం లేదు. మండలంలోని వెల్లంకి, బొడ్డపాలెం, కల్లివానిపాలెం, ఆనందపురం, గొట్టిపల్లి, శొంఠ్యాం, గిడిజాల, పందలపాక, ఆనందపురం జంక్షన్‌లో వీటి పెంపకం ఎక్కువగా ఉంది. ఆనందపురం ఫ్లై ఓవర్ కింద పెందుర్తి వెళ్లే రోడ్డు పక్కన చికెన్ సెంటర్‌లో వ్యర్థాలను వ్యాపారస్తులు విచ్చలవిడిగా పడేస్తున్నారు. దీంతో అక్కడ గుట్టలుగా పేరుకుపోవడంతో పందులు ఆ ప్రాంతాన్ని స్థావరంగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. కొన్నిసార్లు పందులు ఆహారం కోసం గ్రామంలోని ఇళ్లల్లోకి ప్రవేశించి పదార్థాలను కలుషితం చేస్తున్నాయి. పెందుర్తి మార్గంలో బస్సులు, ఆటోల కోసం నిరీక్షించే ప్రయాణికులపై దాడులకు పాల్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మహా నాయకుని జీవితమే ‘యాత్ర – 2’



తాతా థియేటర్ వద్ద యాత్ర - 2 పోస్టర్లు ప్రదర్శిస్తున్న ప్రేక్షకులు, నాయకులు

తగరపువలస: ‘యాత్ర – ’... ఓ సినిమా మాత్రమే కాదని, మహా నాయకుని జీవితమని భీమిలికి చెందిన పలువురు ప్రేక్షకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. గురువారం విడుదలైన యాత్ర – 2 పోస్టర్లు ప్రదర్శించి మాట్లాడారు. ప్రజల కోసం మనిషి రూపం దాల్చి దేవుడైన వైఎస్ రాజశేఖరరెడ్డి తన ఆశయాలను కొనసాగించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనకు ఇచ్చారన్నారు. వారి పాదయాత్రలు తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి పథంలో నడిపించాయన్నారు. ఇరువురి ప్రతిష్టను యాత్ర – 2 ద్వారా ప్రేక్షకుల కళ్లకు కట్టినట్టు వివరించడంతో దర్శక, నిర్మాతలు సఫలీకృతమయ్యారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.ప్రభాకర్‌నాయుడు, వాసుపల్లి కొండబాబు, కొంకి వెంకటేష్, రౌతు శ్రీను, కొయ్యి రామకృష్ణ, గేదెల సత్యనారాయణ, అప్పికొండ బాలకృష్ణ పాల్గొన్నారు.

రూ.2.5 కోట్లతో స్వతంత్రనగర్ పార్కు అభివృద్ధి



ప్రారంభానికి సిద్ధమైన స్వతంత్రనగర్ పార్కు



పార్కులో పచ్చదనం, వాకింగ్ ట్రాక్

నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : నగరం నడిబొడ్డున అన్ని రకాల సదుపాయాలతో మధురవాడలోని స్వతంత్రనగర్ పార్కు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సువిశాల పార్కును రూ.2.50 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేసి అన్ని సదుపాయాలు కల్పించింది. దీనికి రక్షణ గోడ, ఆడిటోరియం, వాకింగ్ ట్రాక్, పిల్లలకు ఆట సామగ్రి, పచ్చదనం కోసం వివిధ రకాల మొక్కలు ఏర్పాటు చేశారు. సందర్శకులు సేద తీరడానికి షెడ్లు, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ పార్కును శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని జీవీఎంసీ ఏఈ సురేష్ చెప్పారు.